క్లుప్తంగా

అమ్మవారికి మంజలి ఉత్సవాలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీగోదాదేవి అమ్మవారి మంజలి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో పలు పూజలు జరిపించిన అనంతరం అమ్మ వారిని గ్రామపురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి పూజ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

స్వరాజ్య పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్

పినపాక: మూడున్నర కోట్ల బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనే ధ్యేయంగా చేపడుతున్న స్వరాజ్య పాదయాత్ర ఆదివారం మండలంలోని మల్లారం, ఈ బయ్యారం, ఎల్చిరెడ్డి పల్లి గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ మాట్లాడుతూ.. ఎల్లప్పుడూ అగ్రకులాల వాళ్లే రాజ్యమేలుతున్నారని, బీసీ ఎస్సీ ఎస్టీలు రాజకీయ బానిసలుగా కొనసాగుతున్నారన్నారు. అట్టడుగు కులాలకు అధికారం అందించడం కోసమే స్వరాజ్య పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పినపాక నాయకులు శివ, రమేష్, సంజీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎన్‌టీ వైద్యశిబిరం

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో బూర్గంపాడులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల బాలికల పాఠశాలలో ఉచిత ఈఎన్‌టీ వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా అధ్యక్షుడు టీఎస్ భాస్కర్‌రావు మాట్లాడుతూ.. క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్యశిబిరంలో 500మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ నిఖిల్, రోటరీ ప్రతినిధులు శ్యామ్‌కిరణ్, అనిత, మురళి, సుధాకర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీకాంత్‌రెడ్డి, బసప్ప రమేష్, ఖాదర్‌వలీ, భాషా, సాయిరామ్, గాయత్రి, శబరీష్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

భద్రాచలంటౌన్: యువతకు క్రీడలు మానసికోల్లాసానికి తోడ్పడతాయని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం వెంకట్రావు అన్నారు. పట్టణంలోని డిపో యూత్ ఆధ్వర్యంలో ఎటపాక పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న టీ20 క్రికెట్ టోర్నమెంట్ ట్రోఫీని ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీలోని యువత ఆటలలో రాణించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేదు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలు అవరోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాకాల దుర్గాప్రసాద్, చారుగుళ్ల శ్రీనివాస్, అజీమ్, రాకేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పచ్చని పరుపులా..



మొద్దులమడ చెరువు సాగునీటిపై పరుపులా పరుచుకున్న పచ్చని గడ్డి..

అశ్వారావుపేటరూరల్: చుట్టూ ఎత్తైన కొండలు, దట్టమైన పచ్చందాలతో నిండి ఉన్న వృక్షాలతో కనుచూపు మేర ఆహ్లాదకరమైన సుందర దృశ్యాలు ఈ ఫొటోలో కనిపిస్తున్నాయి కదా..! ఇక్కడ ఓ సాగు చెరువు కూడా సాగు నీటితో కళకలాడుతోంది. పచ్చని గడ్డి తెప్పలు, తెప్పలు పెరిగి ఆ సాగునీటిపై పచ్చని పరుపులా దర్శనం ఇస్తోంది. ఈ సుందరమైన, ఆహ్లాదరంగా దృశ్యం అశ్వారావుపేట మండలంలోని మారుమూల దట్టమైన ప్రాంతంలోగల మొద్దులమడ సమీపంలోనిది.

లింగమంతుని జాతర నిర్వహణ కమిటీ ఎన్నిక

అశ్వాపురం: అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దులో ఉన్న రేగులగండి గ్రామంలో వచ్చే నెలలో జరిగే భవాని లింగమంతుల జాతర నిర్వహణ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అశ్వాపురంలో బొబ్బాల నాగేష్, మేకల ఆదిలింగయ్య అధ్యక్షతన అశ్వాపురం, మణుగూరు మండలాల యాదవ సంఘం నాయకుల సహకారంతో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా లంకెల రమేష్, గంటా గోవర్ధన్, కోశాధికారిగా తోట శేషయ్య, ఉపాధ్యక్షుడిగా నగేష్, వెంకన్న, చింతల వెంకట్, కార్యదర్శులుగా వీరస్వామి, రమేష్, వలరాజులు ఎన్నికయ్యారు.

ఏజెన్సీలో బియ్యం దందా!

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బియ్యం దుకాణాలు
- ఒకే రకం బియ్యం.. బ్రాండ్‌లు వేరు
- మోసపోతున్న గిరిజనులు



పట్టణంలో ఓ దుకాణంలో బియ్యం నిలువ (ఫైల్)

భద్రాచలంటౌన్: సామాన్యుడి అవసరాలను కొందు వ్యాపారులు వారికి అనుకూలంగా మార్చుకుని వారి దందాను కొనసాగిస్తున్నారు. నిత్యవసర సరుకుల్లో ఒకటైన బియ్యాన్ని రకరకాల బ్రాండ్‌లను పేరులు మార్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఒకే దుకాణంలో పదుల సంఖ్యలో వివిధ బ్రాండ్‌ల పేరులతో బియ్యాన్ని విక్రయిస్తున్నారు. దీంతో నాణ్యమైన బియ్యం కొనాలనుకునే వినియోగదారులను వ్యాపారులు అయోమయంలో పడేస్తున్నారు. ఏది నాణ్యమైన బియ్యమో.. ఏది నకిలి బియ్యమో తెలుసుకోలేక వినియోగదారులు మోసపోతున్నారు. అధికారులు అటువైపు చూడకపోవడంతో వ్యాపారులు రెచ్చిపోతున్నారు.

సంచులపై బ్రాండ్ల ముద్రలతో..

గతంలో ఏజెన్సీలోని ప్రజలు రైస్ మిల్లు ద్వారా ఆడించిన బియ్యాన్నే నిత్యం తినేవారు. కాలక్రమేణా పట్టణ, మండల కేంద్రాల్లోని ప్రజలు ప్యాకింగ్ బ్రాండ్ బియ్యానికి అలవాటు పడ్డారు. ఇదే వ్యాపారులకు వరంగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా అనుమతులు లేకుండానే విక్రయకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఏటా కోట్లలో బియ్యం విక్రయాలు చేపడుతున్నారు. వివిధ జిల్లాలో లభించే మంచి నాణ్యమైన బ్రాండ్ పేరుతో ఇక్కడ సంచులను ముద్రించి ఒకే బియ్యాన్ని వివిధ బ్రాండ్‌ల రూపంలో అమ్ముతున్నారు. ప్రతి రోజు కొన్ని వందల క్వింటాల బియ్యాన్ని అమ్మడమేకాకుండా సరిహద్దు రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

రైస్ మిల్లులే అడ్డాగా..

ప్రభుత్వం గుర్తింపు ఉన్న వారే బియ్యం అమ్మకాలు చేపట్టాలి. కానీ రైస్ మిల్లర్లు ప్రతి ఒక్కరూ ఒక కంపెనీ పేరుతో బియ్యం విక్రయిస్తున్నారు. కొంత మంది రైస్ మిల్లుల యజమానులు రేషన్ బియ్యాన్ని పాలిషింగ్ చేసి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అధిక ధరలకు అమ్మకం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం సూపర్ ఫైన్ రైస్ బియ్యాన్ని కిలో రూ.32కి మించి విక్రయించకూడదు. కానీ వ్యాపారులు అనేక రకాల బ్రాండ్‌ల పేరుతో ఉన్న బియ్యం కిలోకి రూ.40 నుంచి రూ.60 వరకు అమ్ముతున్నారు.

ఇందులో పాత బియ్యానికి ఒక రేటు కొత్త బియ్యానికి ఒక రేటు చొప్పున ప్రజల అవసరాన్ని తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. తూకం విషయంలో 25 కిలోల బ్యాగ్ అని చెబుతున్న దానిని ఎవరు కొలవకపోవడంతో ఎంత బరువు తూగుతేందో అనే అనుమానాలు ఉన్నాయి. ఈ మోసాలను నియంత్రించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అడ్డగోలుగా బ్రాండ్‌ల పేరులో బియ్యం వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బియ్యం విక్రయాలు మా పరిధిలో లేవు



గతంలో బియ్యం విక్రయాలు చేసే వారు ఎస్జీఎల్ లైసెన్స్ కలిగి ఉండేవారు. అప్పుడు బియ్యం విక్రయాలు మా పరిధిలో ఉండేవి. గత కొన్నేళ్ల క్రితం ఆ విధానం రద్దు చేయడంతో పౌరసరఫరాల శాఖ పరిధిలో నుంచి తీసివేశారు. బియ్యం దుకాణం నిర్వహించే వ్యాపారులు పీడీఎస్ బియ్యం తప్ప వేరే బియ్యం విక్రయించుకోవచ్చు.

– వెంకటేశ్వరరావు, సివిల్ సప్లై డీటీ, భద్రాచలం

కేసీఆర్ పాలన ఆదర్శం



బూర్గంపాడు: పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ కాంతారావు

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దేశానికి ఆదర్శంగా నిలుస్తుదని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు అన్నారు. ఉప్పుసాక గ్రామంలో ఆదివారం కాంగ్రెస్, బీజేపీల నుంచి సుమారు 400 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరాయి. ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, కామిరెడ్డి రామకొండారెడ్డి, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మణుగూరురూరల్: పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సమక్షంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే రేగా కాంతారావు బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటిసి పోశం నర్సింహరావు, పీఏసీఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు ముత్యంబాబు,అడపా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'కప్' ఏర్పాట్లు పరిశీలన

పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే కేసీఆర్ కప్ క్రీడాపోటీల్లో భాగంగా క్రీడాకారుల కోసం ఏర్పాటు చేస్తున్న వంటలను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆదివారం సందర్శించి పరిశీలించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

2కె రన్ ప్రారంభం

రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడాపోటీల్లో భాగంగా ఆదివారం మహిళలకు 2కె రన్ నిర్వహించారు. ఈ రన్‌ను సీఎస్‌పీ కాటా వద్ద పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు జెండా ఊపి ప్రారంభించారు.

ప్రైవేట్ హాస్పిటల్..

మణుగూరులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీసాయి అన్నపూర్ణ హాస్పిటల్‌ను పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఆస్పత్రి యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతిని కాపాడుకుందాం



ఆవిష్కరించిన వాల్ పోస్టర్లతో ఎమ్మెల్యే పొదెం వీరయ్య, తదితరులు

భద్రాచలం: ఆదివాసీలకు ప్రత్యేకమైన విభిన్న సంస్కృతి సాంప్రదాయాలను రక్షించి భవిష్యత్ తరాల వారిపై ఉందని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. ఆదివారం సమ్మక్క సారక్క పంక్షన్ హాల్ నందు జరిగిన కార్యక్రమంలో ఆయన చిరుమల్ల శ్రీ సమ్మక్క సారక్క తల్లుల జాతర గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆదివాసీల ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లను పాశ్చాత్య నాగరికతకు దూరంగా ఉంచాలని సూచించారు. సాంస్కృతిక పోరాటాన్ని ప్రతి ఆదివాసీ ముందుకు తీసుకెళ్లాలని, అందుకు జరిగే జాతరలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు గారు వివిధ ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ కార్యదర్శిగా తెల్లం నరేష్..

రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా తెల్లం నరేష్‌ను ఆ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌లాల్ నాయక్ నియమించారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియామక పత్రాన్ని నరేష్‌కు డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అందజేశారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని పొదెం వీరయ్య కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సరేళ్ల నరేష్, టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, నాయకులు భోగాల శ్రీనివాసరెడ్డి, బలుసు సతీష్, బంధం శ్రీనివాస్ గౌడ్, చింతరేల సుధీర్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన ఇద్దరిపై ఆదివారం కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. గ్రామానికి చెందిన అరవై ఏళ్ల వృద్ధుడు తోట వెంకటరామయ్య, పేరిచర్ల గిరి అనే వారిపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో గాయాలయ్యాయి. దాంతో బాధితులు గుమ్మడవల్లి పీహెచ్‌సీకు వెళ్లి చికిత్స చేయించుకున్నారు. గ్రామంలో కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయని, వారం క్రితం ఇద్దరు చిన్నారులను కూడా దాడి చేసి గాయపరిచాయని స్థానికులు చెప్పారు. పెద్ద సంఖ్యలో ఉన్న కుక్కలు ఇప్పటి దాకా గ్రామానికి చెందిన సుమారు 15 మందిపై దాడి చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కుక్కలను నివారించేందుకు గ్రామ పంచాయతీ బాధ్యులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని అనంతారం గ్రామ పంచాయతీ సర్పంచ్ పాయం చిన వెంకయ్య(57) గతకొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతూ.. ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి చెందడం పట్ల స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పలువురు అధికారులు సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబీకులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎంపీపీ వ్యాఖ్యలకు ఖండన

అశ్వారావుపేటరూరల్: అధికార పార్టీకి చెందిన ఎంపీపీ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.పాషా తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి బీఆర్ఎస్ పార్టీకు ఓట్లు వేయాలని వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే అధికారిక కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ గుర్తుకు ఓట్లు వేయాలని హుకుం జారీ చేయడం సబబు కాదన్నారు. దీనిపై అధికారులు పట్టించుకోకుండా వ్యవహారించడం తగదన్నారు.

నియామకాన్ని రద్దు చేయాలి

అశ్వాపురం: టీటీడీపీ పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకాన్ని రద్దు చేయాలని ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆదివారం ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు తుళ్లూరి ప్రకాష్‌రావు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నియామకం.. పార్టీ విధివిధానాలకు విరుద్ధంగా జరిగిందని, సమర్థత లేని వారిని ఏకపక్షంగా నియమించడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. నియమకాన్ని వెంటనే రద్దు చేయాలని నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తీర్మానాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడికి పంపించినట్లు తుళ్లూరి ప్రకాష్‌రావు తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ తుళ్లూరి గంగాభవాని, సీనియర్ నాయకుడు కూరపాటి చలపతిరావు, సాయిన్ని సంపత్, కొర్లకుంట నరేష్, నరసింహారావు, జానకి రామయ్య, వాసు, పద్మ, రమేష్ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

పినపాక: చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని, చట్టాలకు లోబడి ప్రతి ఒక్కరు నడుచుకోవాలని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు పాందురంగాపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. తప్పులు చేయకుండా న్యాయ సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజగోపాల్, ఎస్సై టీవీఆర్ సూరి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మొగిలిపల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలి

భద్రాచలంటౌన్: అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయించిన రూ.43 లక్షలు సరిపోవని, రూ.కోటి విడుదల చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని భగవాస్ దాస్ కాలనీలో నిర్మిస్తున్న అంబేద్కర్ భవనాన్ని ఆదివారం మాలమహానాడు జాతీయ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్ ఆదేశాలను లెక్కచేయకుండా భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించి త్వరగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అధ్యక్షులు దాసరి శేఖర్, వుండేటి రవి, సుధాకర్, ప్రదీప్, ఆమోస్, ఆశీర్వాదం, కామేష్, సతీష్, వెంకటేశ్వరరావు, చిట్టిబాబు, కృష్ణ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకం ఈ స్నేహబంధం



యూసఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న ఎస్సై సంతోష్

బూర్గంపాడు: సంక్రాంతి పండుగ వస్తుందంటే బూర్గంపాడు యువతలో కొత్తసందడి నెలకొంటుంది. పదిహేను ఏళ్ల క్రితం రోడ్డుప్రమాదంలో మృతిచెందిన బూర్గంపాడుకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు యూసుఫ్ జ్ఞాపకార్థం అతని మిత్రులు జిల్లాస్థాయి క్రికెట్‌టోర్నీ నిర్వహిస్తున్నారు. జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణ బరువు బాధ్యతలతో కూడుకున్నదైనప్పటికీ.. దివంగత స్నేహితుడికి ఘననివాళిగా దానిని ఏర్పాటుచేసి బూర్గంపాడు యూత్ తమ స్నేహబంధాన్ని చాటుకుంటూ ఉన్నారు.

బూర్గంపాడుకు చెందిన దివంగత యూసుఫ్ జ్ఞాపకార్థం అతని మిత్రబృందం యూసఫ్ మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తూ అందరి ప్రశంసలూ అందుకుంటోంది. బతుకుదెరువులో భాగంగా వివిధ రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగించే బూర్గంపాడు ఫ్రెండ్స్ యూత్ సంక్రాంతి సమయంలో మాత్రం పనులన్నీ పక్కకు పెట్టి తమ మిత్రుని జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ నిర్వహణకు పూర్తిస్థాయిలో సమయం కేటాయిస్తోంది. టోర్నీ కోసం బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్ చదును చేయటంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లనూ దగ్గరుండి చేపడుతున్నారు. ఈ నెల 12వ తేదీ నుంచి బూర్గంపాడు జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఈ టోర్నమెంట్ ప్రారంభమవుతుంది. జనవరి 18 వరకు కొనసాగుతుంది. టోర్నీలో విన్నర్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతి, ట్రోఫీని అందిస్తారు. రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతి ట్రోఫీని అందిస్తారు. ప్రతి మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందిస్తారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్, బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ ఫీల్డర్లకు కూడా ట్రోఫీలను అందిస్తారు. ఈ టోర్నమెంట్‌ను వీక్షించేందుకు రోజు వందలాదిమంది క్రీడాభిమానులు ఈ మైదానానికి వస్తుంటారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు టోర్నీని తరచూ వీక్షిస్తు నిర్వాహకులకు అండగా నిలుస్తున్నారు.

నగదు జమ చేయాలి

ములకలపల్లి: తెలంగాణా ప్రభుత్వం ప్రకటించిన రైతుబంధు నగదును సంబంధిత రైతు అకౌంట్లలో వెంటనే జమ చేయాలని తెలంగాణా రైతు సంఘం మండల కార్యదర్శి ఊకంటి రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కణితి కాంతారావు, కంకాటి రాజమ్మ, బత్తుల ధనమ్మ, నవలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తరామదాసు విగ్రహ ఆవిష్కరణ

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఉన్న ఫారెస్ట్ చెక్‌పోస్టు సెంటర్ వద్ద కంచర్ల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భక్తరామదాసు విగ్రహ ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా భద్రాచలం ఏఎస్పీ రోహిత్‌రాజ్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. భక్తరామదాసు నాటి నిజాం ప్రభువుల ఆదేశాలను ధిక్కరించి భద్రాచలంలో సీతారామచంద్రమూర్తికి ఆలయాన్ని నిర్మించి భక్తాగ్రేసుడు కంచర్ల గోపన్న అని, భక్త రామదాసుగా కీర్తి గాంచిన వాగ్గేయకారుడు అని అన్నారు. పట్టణ ప్రముఖ వైద్యులు సుదర్శన్, జయభారతి, విజయగోపాల్ పాల్గొన్నారు.

ఉధృతం చేస్తాం..

భద్రాచలంటౌన్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ పట్టణ నాయకురాలు మర్లపాటి రేణుక స్పష్టం చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం డైలీవేజ్ వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పొదెం వీరయ్యకు వినతి పత్రం అందజేశారు. గత 22 నెలులుగా జీతాలు లేకపోవడంతో డైలీవేజ్ వర్కర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం స్పందించి జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, హీరాలాల్, లక్ష్మి, రాములమ్మ, శాంతమ్మ, శారద, సుభద్ర, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా కల్వర్టులు



మండలంలోని దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు దగ్గరలోని ఎఫ్2 దాబా దగ్గర ఉన్న కల్వర్టు, కాసా రేగుబల్లి దగ్గర భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు సమాంతరంగా కల్వర్టులు ఉండటంతో పక్కన గోయ్యి ఉందనే విషయాన్ని మరిచిపోయి వాహనాలను కల్వర్టులకు దగ్గరగా నడుపుతున్నారు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో ఈ రెండు కల్వర్టుల దగ్గర జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అధికారులు ఇప్పటికైనా కల్వర్టుల మర్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- దుమ్ముగూడెం

ప్రశ్నించాల్సిన అధికారి: హరిలాల్, ఆర్అండ్‌బీ డీఈ, భద్రాచలం
ఫోన్ నంబర్: 9440818414

ఆపదలో పలువురు అండగా ..



నగదు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ములకలపల్లి: పెయింటింగ్ పనులు చేస్తూ, ప్రమాదవశాత్తూ గాయపడ్డ నిరుపేద కుటుంబానికి స్థానికులు సాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు, తమశక్తి మేర ఆర్థికసాయిం అందిస్తూ, బాధిత కుటుంబానికి బాసటగా నిలస్తున్నారు. ములకలపల్లి మండలపరిధిలోని భగత్‌సింగ్‌నగర్ గ్రామానికి చెందిన తాళ్ల శ్రీనివాస్ పెయింటింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాధారం గ్రామంలోని ఓ ఇంటికి గత గురువారం పెయింట్ పనులు చేస్తుండగా, పరంజా విరిగిపోవడంతో, కిందపడిపోయాడు. ప్రమాదంలో శ్రీను చేతికి తీవ్రగాయాలయ్యాయి. చేతి కండరాలు బాగా దెబ్బతిన్నాయి, నరాలు తెగిపోవడంతో విపరీతంగా రక్తస్రావం జరిగింది. హుటాహుటిన స్థానిక మంగపేట పీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక వైద్యం అందించి, హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఐతే శ్రీనివాస్ చేతికి ఆపరేషన్ చేయాల్సింటుందని, లక్ష రూపాయలు ఖర్చు అవుతాయని డాక్టర్లు తెలిపారు.

స్పందించిన దాతలు

శ్రీనివాస్ ప్రమాద విషయం, కుటుంబ స్థితిగతులు వాట్సప్ ద్వారా తెలుసుకున్న పలువురు మానవతామూర్తులు ఇతోధికంగా సాయం చేశారు. పలువురు దాతలు ఇప్పటికే సుమారు 10 వేల రూపాయలు 'ఫోన్‌పే'ద్వారా చెల్లించారు. తాజాగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూ.15 వేలను బాధిత యువకుడి తల్లిదండ్రులు సాయమ్మ, ఎర్రయ్యలకు అందజేశారు. ములకలపల్లి మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బత్తుల అంజి 10 వేల రూపాయల నగదు అందజేశారు. తాండ్ర నారాయణరావు (టీఎన్ఆర్) మెమోరియట్ ట్రస్ట్ చైర్మన్ తాండ్ర వెంకటేశ్వరరావు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. హోటల్ నిర్వాహకుడు మేకల రాజేశ్ 5వేల రూపాయల సాయం అందించనున్నట్లు తెలిపారు. శ్రీనివాస్ ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు రూ.1 లక్షకు ఎల్‌టీసీ మంజూరు చేయించగా, లేఖను స్థానిక బీఆర్ఎస్ నాయకులు తాళ్ల శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబానికి అనుకోని ఆపదవాటిల్లగా వారికి అండగా నిలుస్తూ, పలువురు తమ ఔదర్యాన్ని చాటుతున్నారు.

సాయమందించరూ..!

భగత్‌సింగ్‌నగర్‌లో తల్లిదండ్రులు సాయమ్మ, ఎర్రయ్యలతో కలసి శ్రీను కుటుంబం జీవిస్తోంది. రెక్కాడితేకానీ డొక్కాడని నిరుపేద శ్రీనివాస్.. పెయింటింగ్ పనులు చేస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీనుకు భార్య జ్యోతి ఐదు, ఆరో తరగతి విద్యనభ్యసించే అమ్మాయి. అబ్బాయి ఉన్నారు. సాయం అందించాలనుకునే దాతలు 8374346196 నంబర్‌కు 'ఫోన్‌పే'చేయాలని అభ్యర్థిస్తున్నారు.